## ఇక బడుగు వ్యాపారుల పైనా జీఎస్టీ!

న్యూఢిల్లీ, మే 24: మధ్య స్థాయి నుంచి భారీ స్థాయిలో వ్యాపారం చేసే వారిని లక్ష్యంగా చేసుకుని ఎడాపెడా జీఎస్టీ భారాన్ని విధించిన కేంద్రం ఇప్పుడు బడుగు, బలహీన వర్గాలను కూడా పన్ను పరిధిలోకి తేవాలని తహతహలాడుతున్నది. అనధికారిక ఆర్థిక కార్యకలాపాలను నియంత్రించి వారిని కూడా జీఎస్టీ పరిధిలోకి తెచ్చేందుకు కేంద్రం జాతీయ స్థాయిలో ప్రచారం నిర్వహించనుంది. ఈ మేరకు కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) తన ఫీల్డ్ అధికారుల ద్వారా ఆ దిశగా చర్యలు చేపట్టేందుకు కసరత్తులు ప్రారంభించింది. నమోదు కాని సంస్థల ద్వారా పన్ను ఎగవేతలను నిరోధించి నగదు ఆధారిత, లెక్కల్లో చూపని లావాదేవీలపై ఆధారపడటాన్ని తగ్గించాలని ధ్యేయంగా నిర్ణయించుకుంది. ఇదే కనుక అమలైతే ఇక నుంచి బజ్జీల బండి వాళ్లు, బండ్లపై అరటి పండ్లు అమ్ముకునే వారితోపాటు రోడ్డు పక్కన ఉండే మెకానిక్‌లు, సైకిల్ షాపు వాళ్లు, టైర్లకు గాలి కొట్టేవారు.. ఇలా ఒకరేమిటి రోడ్డుపక్కన తోటకూర అమ్ముకునే తాత నుంచి, రేగు పండ్లు అమ్ముకునే మామ్మ వరకు అందరినీ జీఎస్టీ ఎడాపెడా విధించడానికి కేంద్రం చకచకా పావులు కదుపుతున్నది.

## డీ-మెర్జింగ్‌తో వాటాదారులకు లాభమే

టాటా మోటర్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్



న్యూఢిల్లీ, మే 24: టాటా మోటర్స్‌ను విడగొట్టే ప్రతిపాదనతో దీర్ఘకాలికంగా వాటాదారులకు లాభం చేకూరనున్నదని కంపెనీ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ వ్యాఖ్యానించారు. కంపెనీ 80వ వాటాదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టాటా మోటర్స్‌ను రెండు సంస్థలుగా విడగొట్టి కమర్షియల్ వాహనాలు, ప్యాసింజర్ వాహన విభాగాలుగా విడగొట్టి స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాలనుకుంటున్నట్టు చెప్పారు. ఈ ప్రతిపాదనకు ఇప్పటికే వాటాదారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో ఈ ఏడాది రెండో అర్ధభాగం నాటికి టాటా మోటర్స్ రెండు సంస్థలుగా మారబోతున్నాయి. వ్యాపార వ్యూహాత్మకంలో భాగంగా పలు సంస్థలను విడగొట్టాలని నిర్ణయించినట్టు, దీంతో గ్రూపు ఆర్థికంగా బలోపేతం కావడంతోపాటు వాటాదారులకు లబ్ధిచేకూరనున్నదని ఆయన వ్యాఖ్యానించారు.




## గిన్నిస్‌బుక్‌లో ఎల్ఐసీ

**24 గంటల్లో 5.88 లక్షల పాలసీల విక్రయంతో రికార్డు**

న్యూఢిల్లీ, మే 24: ప్రభుత్వరంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ మరో అరుదైన ఘనతను సాధించింది. కేవలం 24 గంటల్లో రికార్డు స్థాయిలో బీమా పాలసీలను విక్రయించి గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నది. ఈ ఏడాది జనవరి 20న ఈ అరుదైన ఘనతను సాధించినట్టు కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. విస్తృతమైన ఏజెన్సీ నెట్‌వర్క్ కలిగిన తమ పనితీరుకు గుర్తుగా గిన్నిస్ వరల్డ్ రికార్డు గుర్తించిందని పేర్కొంది. ఈ ఏడాది జనవరి 20న కంపెనీకి చెందిన 4,52,839 ఏజెంట్లు ఒక్కో పాలసీ చొప్పున 5,88,107 జీవిత బీమా పాలసీలను విక్రయించారు. బీమా చరిత్రలో 24 గంటల వ్యవధిలో ఈ స్థాయిలో పాలసీలను విక్రయించడం ఇదే తొలిసారని తెలిపింది. ఎల్ఐసీ వ్యవస్థాపక దినోత్సవం రోజైన జనవరి 20న 'మ్యాడ్ మిలియన్ డే'ను పురస్కరించుకొని ఒక్కో ఏజెంట్ కనీసం ఒక్కో పాలసీ అయిన పూర్తి చేయాలన్న కంపెనీ ఎండీ, సీఈవో సిద్ధార్థ మొహంతి విజ్ఞప్తి మేరకు ఈ అరుదైన ఫీట్‌ను సాధించినట్టు వెల్లడించారు. ఈ అరుదైన మైలురాయిని సాధించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తంచేశారు.




## సింగిల్ చార్జింగ్‌తో 835 కిలోమీటర్లు

**ఈవీను విడుదల చేసిన చైనా సంస్థ షియోమీ**

న్యూఢిల్లీ, మే 24: చైనాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ షియోమీ మరో ఈవీతో ముందుకొచ్చింది. ఇప్పటికే తన తొలి మోడల్‌కు విశేష స్పందన లభిస్తున్న ప్రస్తుత తరుణంలో మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వైయూ7 పేరుతో విడుదల చేసిన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో గరిష్ఠంగా 835 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. టెస్లాకు చెందిన వై మాడల్‌కు పోటీగా ఈ కారును ప్రవేశపెట్టింది. ఇప్పటికే విడుదల చేసిన ఎస్‌యూ7 సెడాన్ 2.58 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి.

**ఈ నూతన కారు ప్రత్యేకతలు..**

- సింగిల్ చార్జింగ్‌తో 835 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. అత్యధిక మైలేజీ ఇచ్చే మూడో మాడల్ ఇదే కావడం విశేషం.
- 96.3 కిలోవాట్ల ఎల్ఎఫ్‌పీ బ్యాటరీతో తీర్చిదిద్దింది. కేవలం 3.23 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ మాడల్ గంటకు 253 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.
- ప్రో మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 770 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.

# ఎఫ్‌డీఐలు తిరోగమనం

**2024-25లో భారీగా తగ్గిన విదేశీ పెట్టుబడులు**



న్యూఢిల్లీ, మే 24: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆకట్టుకోవడంలో నరేంద్ర మోదీ సర్కార్ విఫలమవుతున్నది. గడిచిన కొన్నేండ్లుగా తగ్గుముఖం పట్టిన ఎఫ్‌డీఐలు..గడిచిన ఆర్థిక సంవత్సరంలోనూ భారీగా పడిపోయాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్‌లోకి కేవలం 353 మిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి. ఈ విషయాన్ని రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. అంతక్రితం ఏడాది వచ్చిన 10 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలతో పోలిస్తే 96.5 శాతం తగ్గాయని పేర్కొంది. అంతక్రితం ఏడాది రికార్డు స్థాయి ఎఫ్‌డీఐలను ఆకర్శించిన భారత్.. ఆ మరుసటి ఏడాదే భారీగా పడిపోవడం విశేషం. కానీ, విదేశాల్లో పెట్టుబడులు పెట్టే దేశీయ కంపెనీలు భారీగా పెరుగుతున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఆయా సంస్థలు 29 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టాయి. అంతక్రితం ఏడాది పెట్టిన 17 బిలియన్ డాలర్ల కంటే ఇది 50 శాతానికి పైగా అధికం.

**విదేశీ పెట్టుబడిదారులు దూరం**

ప్రపంచ దేశాల్లో భారత్ అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్నప్పటికీ విదేశీ పెట్టుబడిదారులు పెద్దగా ఆసక్తిని కనబర్చడం లేదు. దీంతో గడిచిన కొన్నేండ్లుగా భారీగా పెట్టుబడులు పెట్టిన విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు..గతేడాది పెట్టుబడులు పెట్టడానికి వెనుకంజవేశారు. కానీ, దేశీయ ఈక్విటీ మార్కెట్లపై మాత్రం ఎనలేని ప్రేమను కురిపిస్తున్నారు. ఇతర దేశాల ఈక్విటీ మార్కెట్లతో పోలిస్తే సెన్సెక్స్, నిఫ్టీలు రెండంకెల స్థాయిలో రాబడిని పంచడమే ఇందుకు కారణం. మొత్తంగా గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌డీఐలు 13.7 శాతం పెరిగి 81 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. వీటిలో సగం ఐపీవోకి వచ్చిన సంస్థల్లో ఇన్వెస్ట్ చేశారు. 2023-24 సంవత్సరంలో విదేశీ పెట్టుబడిదారులు 49 బిలియన్ డాలర్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్ ఫండ్స్, ఆల్ఫా వేవ్ గ్లోబల్ అండ్ పార్టనర్స్ గ్రూపు, స్విగ్గీ, విశాల్ మెగా మార్ట్‌లోకి వచ్చిన ఎఫ్‌డీఐలు అత్యధికంగా వచ్చాయి. అలాగే ఆల్టర్‌నెటివ్ క్యాపిటల్ అసోసియేషన్(ఐవీసీఏ), ఈవై, పీఈ/వీసీ ల నుంచి 26.7 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. హ్యుందాయ్ మోటర్ ఇండియా తన వాటాను 100 శాతం నుంచి 82.5 శాతానికి తగ్గించుకోవడంతో రూ.27,870 కోట్ల నిధులు సమకూరగా, అలాగే స్విగ్గీ కూడా 2 బిలియన్ డాలర్ల నిధులను సేకరించింది. వీటితోపాటు టెలికం దిగ్గజం సింగ్‌టెల్..భారతీ ఎయిర్‌టెల్‌లో తనకున్న వాటాను మొత్తం విక్రయించగా, అలాగే బ్రిటిష్ అమెరికన్ టొబాకో(బీఏటీ)..ఐటీసీలో ఉన్న తన మొత్తం వాటాను విక్రయించింది. గతేడాది సెప్టెంబర్ నెలలో దేశీయ ఈక్విటీ మార్కెట్లు రాకెట్ వేగంతో దూసుకుపోవడంతో ఒక్కో విదేశీ కంపెనీలు..దేశీయ పెట్టుబడులను ఉపసంహరించుకున్నాయి.

**తయారీ రంగానికి బ్రేక్‌లు**

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆకట్టుకోవడంలో తయారీ రంగంతోపాటు ఆర్థిక సేవలు, ఎనర్జీ, కమ్యూనికేషన్ రంగాలు విఫలమయ్యాయి. గత కొన్నేండ్లుగా ఈ రంగాలు ఆశాజనక పనితీరు కనబర్చలేకపోవడంతో విదేశీ పెట్టుబడిదారులు వీటివైపు కన్నెత్తి కూడా చూడలేదు. తయారీ, ఆర్థిక సేవలు, ఎనర్జీ, టెలికం రంగాల్లోకి ఎఫ్‌డీఐలు భారీగా తగ్గడం మొత్తం ఎఫ్‌డీఐలపై ప్రతికూల ప్రభావం చూపాయని సెంట్రల్ బ్యాంక్ తాజా నివేదికలో వెల్లడించింది.

## హైదరాబాద్‌లో యంత్రాల ఎగ్జిబిషన్

హైదరాబాద్, మే 24: దక్షిణాదిలో అతిపెద్ద బీ2బీ ఇండస్ట్రియల్ యంత్రాలు అండ్ ఇంజినీరింగ్ ఎగ్జిబిషన్‌కు మరోసారి హైదరాబాద్ వేదికైంది. నాలుగోసారి జరుగుతున్న ఈ ఎగ్జిబిషన్‌లో ఇంజినీరింగ్, మౌలిక రంగానికి సంబంధించిన అన్ని రకాల ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. మెషిన్ టూల్స్, ఆటోమేషన్, రోబోటిక్స్, వెల్డింగ్, ఎలక్ట్రికల్, ఇండస్ట్రియల్, ఇంజినీరింగ్ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు.

**బ్రోక్‌ఫిల్డ్ భారీ పెట్టుబడులు**

న్యూఢిల్లీ, మే 24: అంతర్జాతీయ పెట్టుబడుల సంస్థ బ్రోక్‌ఫిల్డ్..భారత్‌లో భారీ పెట్టుబడులకు సిద్ధమవుతున్నది. వచ్చే ఐదేండ్లకాలంలో తన ఆస్తులను 100 బిలియన్ డాలర్ల స్థాయిలో పెంచుకోవడానికి భారీగా ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నది. ప్రస్తుతం సంస్థ భారత్‌లో 30 బిలియన్ డాలర్ల విలువైన ఆస్తులు కలిగివున్నది. మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్, రెన్యూవబుల్ ఎనర్జీ, ప్రైవేట్ ఈక్విటీల్లో తన అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్ కలిగివున్నది.

## ఎఫ్ఐఐల 5 వేల కోట్లు వెనక్కి

**గతవారంలో తరలించుకుపోయిన విదేశీ ఇన్వెస్టర్లు**

న్యూఢిల్లీ, మే 24: దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీ స్థాయిలో నిధులను వెనక్కితీసుకుంటున్నారు. ఇదే క్రమంలో ప్రస్తుత వారంలోనూ రూ.5 వేల కోట్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావడంతో ఈ నెల 19 నుంచి 23 మధ్యకాలంలో ఈక్విటీల నుంచి రూ.4,784.32 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎఫ్ఐఐల పెట్టుబడులు రూ.18,620 కోట్ల నుంచి రూ.13,835 కోట్లకు తగ్గాయని నేషనల్



సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గత ఐదు సెషన్లలో విదేశీ పెట్టుబడిదారులు అత్యధికంగా తమ పెట్టుబడులను తరలించుకుపోయారు. తీవ్ర ఊగిసలాటల మధ్య కొనసాగిన సూచీలు గతవారంలో ఒకేరోజు 10 వేల కోట్ల రూపాయల పెట్టుబడులను వెనక్కితీసుకున్నారు. అయినప్పటికీ ప్రస్తుత సంవత్సరంలో దేశీయ ఈక్విటీ మార్కెట్లోకి ఎఫ్ఐఐలు రూ.98,516 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్..యూరోపియన్ దేశాలపై ప్రతీకార సుంకాలను 50 శాతం విధిస్తూ తీసుకున్న నిర్ణయం అంతర్జాతీయంగా పెట్టుబడిదారుల్లో ఆందోళన నెలకొన్నది. ఫలితంగా ఈక్విటీల నుంచి తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాల వైపు మళ్లించారు. దేశీయ ఆర్థిక మూలాలపై ఎలాంటి ప్రభావం లేదని, కేవలం అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాల వల్లనే ఎఫ్ఐఐలు వెనక్కి తీసుకుంటున్నారని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. ఏప్రిల్ నెలలో ఎఫ్ఐఐలు రూ.4,223 కోట్ల పెట్టుబడులు పెట్టగా, మార్చి నెలలో రూ.3,973 కోట్ల విలువైన స్టాక్స్‌ను కొనుగోలు చేశారు. కానీ, జనవరి నెలలో రూ.78 వేల కోట్లు, ఫిబ్రవరి నెలలో రూ.34,574 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.

## ఎన్‌టీపీసీ రూ.33.50 డివిడెండ్

న్యూఢిల్లీ, మే 24: ప్రభుత్వరంగ విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్‌టీపీసీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.7,897.14 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.6,490.05 కోట్ల లాభంతో పోలిస్తే భారీగా వృద్ధిని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.48,816.55 కోట్ల నుంచి రూ.51,085 కోట్లకు ఎగబాకింది. దీంట్లో విద్యుత్ ఉత్పత్తి ద్వారా సంస్థకు రూ.49,352 కోట్ల ఆదాయం సమకూరింది. గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.1,90,862.45 కోట్ల ఆదాయంపై రూ.23,953.15 కోట్ల నికర లాభాన్ని గడించింది. మరోవైపు, 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.33.50 తుది డివిడెండ్‌ను బోర్డు ప్రకటించింది. గతేడాది కొత్తగా 3,972 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అందుబాటులోకి రావడంతో మొత్తం కెపాసిటీ 79,930 మెగావాట్లకు చేరుకున్నది.



డీఈవో రామును సన్మానిస్తున్న ఎంఈవో, ప్రధానోపాధ్యాయులు

## విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషిచేయాలి

కోరుట్ల, మే 24: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రాము పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన వృత్యాంతర శిక్షణ శిబిరాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ, ఉపాధ్యాయులు నూతన పోకడలను అవలంబిస్తూ విద్యార్థులకు బోధన చేయాలన్నారు. విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన విద్యనందించాలన్నారు. మానవతా విలువలు, సామాజిక స్పృహ, పర్యావరణ పరిరక్షణ, శారీరక, సామాజిక ఆలోచన, భావపవర్తన, మేథోవికాసం, విశ్వాసం పెం పొందించేలా విద్యార్థులకు విద్యాబోధన అందించాలని తెలిపారు. పాఠశాల సమయపాలన పాటించి, సమయాన్ని బోధనకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంకితభావంతో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. విద్యార్థులకు ఒక స్నేహితుడిగా, మార్గదర్శిగా, ఆదర్శంగా నిలువాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో విద్యార్థుల ప్రగతి, పాఠశాల అభివృద్ధిపై చర్చించాలని సూచనలు చేశారు. అనంతరం పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో జిల్లా రాష్ట్రస్థాయిలో నాలుగో స్థానంలో నిలిచేందుకు కృషిచేసిన డీఈవోతోపాటు ఎంఈవో నరేశంను హెచ్‌ఎం సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నునావత్ రాజు, కృష్ణమోహన్‌రా వు, రావికంటి పవన్ కుమార్, జీవన్‌రెడ్డి, రమాదేవి, నకుమల్ల నర్సయ్య, రణధీర్, సురేశ్, అజయ్, మధుసూదన్‌రావు, రిసోర్స్‌పర్సన్లు రాజేశ్, దామోదర్, చిరంజీవి, శ్రీనివాస్, శివ ప్రసాద్, మహేశ్, శేఖర్, సీఆర్పీలు గంగాధర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## నాణ్యమైన ఆహారం అందించాలి

**మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్**

కోరుట్ల, మే 24: రెస్టారెంటుల్లో వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలో ని పలు రెస్టారెంట్లు, బేకరీలు, దాబాల్లో కమిషనర్ ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెస్టారెంట్లు, బేకరీలు, దాబాల్లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, గడువు తీరిన తినుబండారాల ప్యాకెట్లు, నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను స్వాధీనం చేసుకున్నారు. అపరిశుభ్రతమైన వాతావరణంలో తినుబండారాలు విక్రయిస్తున్న షాపు యజమానులకు రూ.10,500 జరిమానా విధించారు. రెస్టారెంట్లలో పరిశుభ్రత పాటించాలని, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు వడ్డిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే సీజ్ చేస్తామన్నారు. వ్యాపారులు తడి, పొడి చెత్తను వేరుచేసి పారిశుధ్య వాహన సిబ్బందికి అందించాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, బాలె అశోక్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరు మహేశ్, మున్సిపల్ సిబ్బంది హేమంత్, జవాన్లు రమేశ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లాలో మరో దారుణం!

- ఏడేళ్ల బాలికపై లైంగిక దాడి
- వృద్ధుడిపై పోక్సో కేసు

మెట్‌పల్లి, మే 24 : జగిత్యాల జిల్లాలో మరో దారుణం జరిగింది. ఏడేళ్ల బాలికపై 70 ఏండ్ల వృద్ధుడు లైంగిక దాడి చేసిన ఘటన ఆలస్యంగా తెలిసింది. మెట్‌పల్లి పట్టణంలోని ఓ అద్దె ఇంటి లో ఒంటరిగా నివాసం ఉండే వృద్ధుడు ఈ నెల 22న ఆరుబయట ఆడుకుంటున్న బాలికకు సెల్‌ఫోన్ ఆశచూపి గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు సమాచారం. బాలిక ఏడ్చుకుంటూ గదిలో నుంచి బయటకు రావడంతో అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు ఆరా తీయగా జరిగిన విషయం బయటపడింది. బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు దర్యాప్తు చేసి, నిందితుడిని జ్యుడీషియల్ రిమాండ్ తరలించినట్లు సమాచారం. కాగా, జిల్లాలో వారం వ్యవధిలో పోక్సో చట్టం కింద రెండు కేసులు నమోదు కావడం కలకలం రేపుతోంది.

## తడిసిన ధాన్యం..
# పేరుకుపోయిన నిల్వలు

- కేంద్రాల్లో ముందుకుసాగని కొనుగోళ్లు
- మరో రెండురోజుల పాటు వర్షాలు
- వడ్లు తడవడంతో తీవ్రనష్టం
- కుప్పల వద్ద రైతుల పడిగాపులు
- తడిసిన వడ్లు వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్



అకాల వర్షంతో కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలపై కప్పిన టర్పాలిన్లు

రాయికల్, మే 24: ఆరుకాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి రైతులు తీవ్ర అవస్థలు పడాల్సివస్తున్నది. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చినప్పటి నుంచి తూకం వేసి మిల్లులకు తరలించేదాకా వారు పడుతున్న కష్టాలు అన్నిఇన్ని కాదు. కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం తేమశాతం రాక, మరో వైపు అకాల వర్షాలతో ధాన్యం కొనుగోలు ముందుకు సాగడంలేదు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ధాన్యం కొనుగోలు ముందుకుసాగక కేంద్రాల్లో నిల్వలు పేరుకుపోయాయి. అకాల వర్షాలకు కేంద్రాల్లోని వడ్లు తడవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చి రోజులు గడుస్తున్నా.. తేమశాతం రాలేదంటూ తూకం వేయడంలేదని వాపోతున్నారు. కొన్ని గ్రామాల్లో రైతుల వడ్లు తేమశాతం వస్తున్నా.. అక్కడ వర్షాలు పడడంతో ఇక ధాన్యం ఎప్పుడు అమ్ముడుపోతుందని రైతులు నిరాశ చెందుతున్నారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని అధికారులు ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.

**ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు**

మూడు రోజులుగా అకాల వర్షాలు పడడంతో కేంద్రాల్లోని ధాన్యం తడవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికతో ధాన్యాన్ని ఎలా కాపాడుకోవాలో అర్థం కావడం అని రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షాల నేపథ్యంలో కేంద్రాల్లోని తమ వరి కుప్పల వద్ద పడి కాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది.

**ఇప్పటి వరకు 1.48లక్షల క్వింటాళ్లు కొనుగోలు**

ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు మండలంలో 27కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో సింగిల్‌విండోల ద్వారా 19, ఐకేపీ ద్వారా 6, రైతు సొసైటీల ద్వారా 2కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోళ్లు జరుపుతున్నారు. కాగా ఇప్పటివరకు ఆయా కొనుగోలు కేంద్రాలకు 3,423 మంది రైతులు 1.83 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని తీసుకురాగా 2,763 మంది రైతుల వద్ద నుంచి 1.48 క్వింటాళ్ల ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేశారు. ఇందులో 2,673 మంది రైతులకు సంబంధించిన 1.44లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని మిల్లులకు తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు.

**మిల్లర్ల కోతలతో మరింత నష్టం**

అకాల వర్షం అన్నదాతలను అతలాకుతలం చేస్తుంటే మరో వైపు మిల్లర్లు తేమశాతం లేదని, వర్షానికి ధాన్యం తడిచిందని అందినకాడికి కోతలు విధిస్తూ దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తాలు తప్పులు కలుపుకొని ఒక్కో బస్తా 42 కిలోల తూకం వేస్తున్నారు. అకాల వర్షం, తేమశాతం పేరిట మిల్లులకు చేరుకున్న ధాన్యాన్ని అదనంగా మూడు నుంచి ఐదు కిలోలు మిల్లర్లు కట్ చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని పేర్కొంటున్నారు.

**తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం**

అకాల వర్షాలతో కేంద్రాల్లో తడిసిన ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం. కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలిస్తున్నాం. ఒకవేళ ట్రాన్స్‌ఫోర్ట్‌కు ఇబ్బంది అయితే ప్రత్యేకంగా ట్రాక్టర్లు పెట్టి ధాన్యాన్ని మిల్లర్లకు తరలిస్తాం. ట్రాక్టర్ల ద్వారా తరలించే ధాన్యానికి రైతులు ఎలాంటి ట్రాన్స్‌ఫోర్ట్ చార్జీలు ఇవ్వాల్సిన అవసరం లేదు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించిన తర్వాత అక్కడ కూడా అదనంగా ధాన్యం కట్ చేయకుండా చర్యలు తీసుకుంటాం.

*- గణేశ్, తహసీల్దార్ (రాయికల్)*

## ₹50 వేలు ఇస్తే ఇందిరమ్మ ఇల్లు

- పైసలిస్తేనే మంజూరు చేస్తున్నరు
- మానకొండూర్‌లో ఇండ్ల దందా జరుగుతోంది
- మాజీ ఎమ్మెల్యే రసమయి సంచలన ఆరోపణలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

తిమ్మాపూర్, మే24: మానకొండూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల దందా నడుస్తున్నదని, 'రూ.50వేలు కొట్టు.. ఇల్లు పట్టు' అని లబ్ధిదారులకు ఆఫర్ ఇస్తున్నారని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సంచలన ఆరోపణలు చేశారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు తెలిసే ఇదంతా జరుగుతున్నదా..? అని ప్రశ్నించారు. శనివారం తిమ్మాపూర్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల అర్హుల ఎంపికలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. గ్రామాల్లో సభలు నిర్వహించి దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను సెలెక్ట్ చేసి గ్రామ సభ తీర్మానం ద్వారా కలెక్టర్ లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉందన్నారు. కానీ మానకొండూర్ నియోజకవర్గంలో ప్రభుత్వ నిబంధనలు, జీవో ప్రకారం లబ్ధిదారుల ఎంపిక జరగడం లేదన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, స్థానిక కాంగ్రెస్ లీడర్లు ఇష్టారీతిన వ్యవహరిస్తూ నిబంధనలకు విరుద్ధంగా వారికి ఇష్టం వచ్చిన వారికి, కార్యకర్తలకు ఇండ్లు ఇచ్చుకుంటూ అర్హులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఒక్కో ఇందిరమ్మ ఇంటికి రూ.50వేలు ఇస్తేనే లిస్ట్‌లో పేరు వస్తుందంటూ బహిరంగంగా దందా చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి ఇందిరమ్మ ఇండ్ల దందాతో కార్యకర్తలకు ఉపాధి కల్పిస్తున్నారన్నారు. రూ.50వేలలో వారికి సగం, పైకి సగం వెళ్తాయని స్వయంగా ఓ గ్రామ కాంగ్రెస్ లీడర్ చెప్పాడని రసమయి కుండబద్దలు కొట్టారు. అలాగే ఓ మండలానికి చెందిన విలేకరి పేరు ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో రాగా, ఆయన నుంచి సైతం రూ.50వేలు వసూలు చేశారని, తన దగ్గర అన్ని సాక్ష్యాలున్నాయన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం నియోజకవర్గంలో 42వేల మంది ప్రజాపాలన సభల్లో దరఖాస్తు చేస్కున్నారని, కానీ నేడు కేవలం 3,500మందికే ఇండ్లు ఇస్తామని ఎమ్మెల్యే చెబుతున్నారని, అయితే మిగిలిన వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఆ కొద్ది మందిలో సైతం అనేక కొర్రీలు పెడుతూ తిరస్కరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, నాయకులు పాల్గొన్నారు.



నారాయణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీసీ కమిషన్ మాజీ అధ్యక్షుడు బీఎస్ రాములు

## నారాయణ కుటుంబాన్ని ఆదుకోవాలి

- బీసీ కమిషన్ మాజీ అధ్యక్షుడు బీఎస్ రాములు
- బాధిత కుటుంబానికి పరామర్శ

కోరుట్ల రూరల్, మే 24: కోరుట్ల మండలం సర్పరాజ్‌పూర్ గ్రామానికి చెందిన మొదటితరం పీపుల్స్‌వార్ పొట్టవత్తిని నారాయణ అలియాస్ కల్లూరు, పల్లె, పండుగ నారాయణ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ అధ్యక్షుడు బీఎస్ రాములు కోరారు. శనివారం ఆయన నారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ, జగిత్యాల జైత్రయాత్ర, రైతు కూలీ సంఘం, భూ పోరాటాల ఉద్యమాలు, దున్నేవానికి భూమి, కూలీలకు వేతనాలు వెట్టిచాకిరీకి విముక్తి పోరాటాల్లో నారాయణ చేసిన ఉద్యమం ఎనలేనిదని కొనియాడారు. ప్రభుత్వం నారాయణ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఇక్కడ కల్లూరు మాజీ సర్పంచ్ వనతడుపుల అంజయ్య, తదితరులు ఉన్నారు.

## ఏ ఆపదొచ్చిన అండగా ఉంటాం


- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాల, మే 24: కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చిన అన్నివిధాలా అండగా ఉంటానని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పేర్కొన్నారు. జగిత్యాల నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు శనివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దావ సురేశ్, బీఆర్‌ఎస్ అర్బన్ మండలాధ్యక్షుడు తుమ్మ గంగాధర్, సారంగాపూర్ మండలాధ్యక్షుడు తేలు రాజు, రాయికల్ మండల ఉపాధ్యక్షుడు మహేశ్, నేతలు సాయిరెడ్డి, పడాల సత్యం, యోహన్ పాల్గొన్నారు.

## విద్యార్హతతో జీపీవో పరీక్షకు దూరం



హరి అశోక్‌కుమార్

జగిత్యాల మే 24: జీపీవో (గ్రామ రెవెన్యూ అధికారి) పోస్టులకు గానూ ఈ నెల 25న నిర్వహించే రాత పరీక్షకు డిగ్రీ, ఐదేళ్ల సర్వీస్‌తో పాటు ఇంటర్ విద్యార్హత పెట్టడం, దీనికి తోడు పాత సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోమని స్పష్టం చేయడంతో చాలామంది పూర్వ వీఆర్‌ఏలు, వీఆర్వోలు జీపీవో పరీక్షకు దూరంకానున్నారని పూర్వ వీఆర్‌ఏ, వీఆర్వోల సంఘాల జగిత్యాల జిల్లా గౌరవాధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిలబస్ ఏమిటో తెలియక అర్హత కలిగి పరీక్షకు హాజరవుతున్న వారు సతమతం అవుతున్నారని తెలిపారు.